క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు(ఎం) : మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నేడు (శనివారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బండారి యాదగిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

మత్స్యగిరి హుండీ ఆదాయం రూ.14.46 లక్షలు

వలిగొండ : మండలంలోని వెంకటాపురంలో గల శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించుకున్న నగదు, కానుకలను శుక్రవారం లెక్కించారు. నాలుగు నెలల 12 రోజులకు గాను రూ.14,46,646 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం ఈఓ మోహన్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ భువనగిరి డివిజన్ పరిశీలకులు సుమతి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చేనేతపై జీఎస్టీ రద్దుచేయాలి

రామన్నపేట : చేనేత ఉత్పత్తులపై కేంద్రం విధించిన జీఎస్టీని రద్దుచేయాలని పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు ఇడెం శ్రీనివాస్ కోరారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎర్రకోట నుంచి రాజ్‌ఘాట్ వరకు చేనేత మార్చ్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. చేనేతమార్చ్ విజయవంతం కోసం 40 చేనేత కార్మికులను తన సొంత ఖర్చులతో ఢిల్లీకి తీసుకువెళ్తున్నానని తెలిపారు.

చేనేత కార్మికుల రుణాలు మాఫీ చేయాలి

భూదాన్‌పోచంపల్లి : చేనేత కార్మికులు తీసుకున్న రుణాలు మాఫీ చేయాలని పద్మశాలీ చేనేత కార్మిక సంఘం అధ్యక్షురాలు మెరుగు శశికళ అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కరోనా ప్రారంభం నాటి నుంచి చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుందన్నారు. వస్త్రాల కొనుగోళ్లు తగ్గిపోయి, స్టాక్ నిలిచిపోయిందన్నారు. ఉపాధి లేక బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు చెల్లించలేని స్థితిలో ఉన్నారన్నారు. సమావేశంలో డైరెక్టర్లు భారత భూషణ్, నీలమ్మ పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ఎమ్మెల్యేకు వినతి

భూదాన్‌పోచంపల్లి : తమ వేతనాలు పెంచాలని కోరుతూ మెప్మా రిసోర్స్ పర్సన్లు శుక్రవారం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హరితహారం, స్వచ్ఛభారత్, ఐహెచ్‌ఎల్ సర్వే, స్ట్రీట్‌వెండర్ సర్వే కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ అనేక సేవలందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రూ.4వేల వేతనంతో కుటుంబ పోషణకు సరిపోవడలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీల సంఘం అధ్యక్షురాలు ఆర్. వసంత, పద్మజ, పద్మ, సంతోష, అనురాధ, రమ్య, సుజాత, సురేఖ, చంద్రిక, చంద్రకళ, నవనీత, ఖమరున్నీసాబేగం పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించాలి

చౌటుప్పల్ : పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులను చెల్లించాలని కోరుతూ శుక్రవారం మధ్యాహ్న భోజనవంట కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సకాలంలో బిల్లులు రాక నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, మమత, మంజుల, శోభ, సంధ్యారాణి, విజయ, సీతమ్మ, సత్యనారాయణ, లక్ష్మమ్మ, కృష్ణ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటు చేయాలి

ఆలేరురూరల్ : ఆలేరు బస్టాండ్‌లో బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి కాసుల నరేష్ డిమాండ్ చేశారు. బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కంట్రోలర్ సుదర్శన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్‌పాస్ కౌంటర్ లేనందున విద్యార్థులు భువనగిరి లేదా జనగాం వెళ్లాల్సి వస్తుందని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఆయుర్వేద వైద్యశిబిరం

ఆత్మకూరు(ఎం) : మండలంలోని సింగారంలో శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జామ యాదయ్య, ఎంపీటీసీ సత్యనారాయణ వైద్యాధికారి జయశ్రీ పాల్గొన్నారు.

తల్లిపాలే పిల్లలకు ఆరోగ్యం

ఆత్మకూరు(ఎం) : తల్లిపాలతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని మోత్కూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ సీహెచ్ జ్యోతి అన్నారు. శుక్రవారం మండలంలోని కూరెళ్లలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో ధనమ్మ, మంగమ్మ పాల్గొన్నారు.

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని 18వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కామిశెట్టి శైలజ, చెన్నోజు స్వాతి, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, సైదమ్మ పాల్గొన్నారు.

వలిగొండ : మండలంలోని వేములకొండ, సంగం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో జనార్దన్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, ప్రేమలత, సువర్ణ, సైదులు, వినోద, సుస్మిత, కృష్ణ వేణి పాల్గొన్నారు.

ఏడేళ్లయినా ఎదురుచూపులే..

- 2016లో రామన్నపేట పంచాయతీ భవనానికి రూ.12 లక్షలు మంజూరు
- పనులు పూర్తికాకపోవడంతో శిథిల భవనంలోనే పాలన
- ఇబ్బందులు పడుతున్న పాలకవర్గం



అసంపూర్తిగా నూతన పంచాయతీ భవనం



శిథిలావస్థలో ఉన్న ప్రస్తుత పంచాయతీ భవనం

రామన్నపేట : రామన్నపేట పంచాయతీ భవన నిర్మాణానికి ఏడేళ్ల క్రితం శంకుస్థాపన చేశారు. కానీ నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోవడంతో పాత పంచాయతీ భవనంలో పాలన సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. రామన్నపేట నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి 2016లో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి రూ. 12లక్షలు మంజూరయ్యాయి. అదే ఏడాది సెప్టెంబర్ 7న పంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రారంభంలో వివిధ కారణాలతో నిర్మాణ పనులు మందకొడిగా సాగాయి. ఆతర్వాత బిల్లులు సకాలంలో రాక నిర్మాణ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. దీంతో పంచాయతీ పాలనను శిథిలావస్థలో ఉన్న పాత భవనంలోనే కొనసాగిస్తున్నారు. గ్రామాభివృద్ధి కోసం పాలకవర్గ సభ్యులు నిర్వహించాల్సిన సమావేశాలు శిథిలావస్థలో ఉన్న పంచాయతీ భవనంలోనే నామమాత్రంగా జరుగుతున్నాయి. భవనంలో సరైన వసతులు లేక పాలకవర్గ సభ్యులతో పాటు అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

శిథిలావస్థలో ప్రస్తుత భవనం

ప్రస్తుతం ఉన్న పంచాయతీ భవనాన్ని 1975లో నిర్మించారు. భవన నిర్మాణం జరిగి సుమారు 48 సంవత్సరాలు కావడంతో భవనం శిథిలదశకు చేరింది. పైకప్పు ఇనుప చువ్వలు తేలి పెచ్చులూడి పడుతున్నాయి. వర్షపు నీరు స్లాబ్‌గుండా, గోడల గుండా గదులలోకి కారుతుంది. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు నూతనంగా నిర్మించి పంచాయతీ భవనంలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



ప్రస్తుత పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరింది. భవనంలో సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాం. స్లాబ్ పై నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. వర్షం వస్తే గోడల వెంట నీరు కారుతుంది. నూతన భవనంలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయించి ప్రారంభించడానికి చర్య తీసుకోవాలని కోరుతున్నాం.

– మిర్యాల ప్రమీల, వార్డుసభ్యురాలు

సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

భువనగిరి : ప్రతిఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని రోటరీ క్లబ్ 3150 అధ్యక్షుడు బుసిరెడ్డి శంకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి ఫోర్ట్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ నూతన అధ్యక్షుడిగా మందడి వెంకట్ రెడ్డి, కార్యదర్శిగా సాబన్‌కార్ వెంకటేశం, కోశాధికారిగా బింగి నరేష్‌లతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ కె నిమ్మయ్య, ఎంపల్ల బుచ్చిరెడ్డి, జ్ఞాన ప్రకాష్‌రెడ్డి, చెన్న లక్ష్మణ్, దిడ్డికాడి బాలాజీ, ఫక్కీర్ కొండల్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, వెంకటేష్, బాలరాజ్, ఉపేందర్ రెడ్డి, భగత్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కాందిశీకుల భూములు కాపాడాలి



భూములను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

చౌటుప్పల్ : కాందిశీకుల భూములను కాపాడాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్యయాదవ్ అన్నారు. మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామంలోని కాందిశీకుల భూములను శుక్రవారం టీడీపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోట్ల రూపాయల విలువైన భూమిని కబ్జా చేసేందుకు వారసులను సృష్టించి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఆ భూమిని నిరుపేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు నిస్పక్షపాతంగా వ్యవహరించి భూముల రక్షణకు నడుం బిగించాలన్నారు. కాందిశీకుల భూములు కాపాడుకునేందుకు ప్రజలతో కలిసి ఆందోళన చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోసుకొండ వెంకటేష్, నల్ల పర్వతాలు, మారగోని అశోక్, ముద్దం శ్రీనివాస్, తడక కోటేశ్వర్, కందగట్ల మురళి, దేప నాగేష్, సుంకరి జంగయ్య, ఆనగళ్ల నర్సింహ, ఎండీ.జహంగీర్, బత్తుల శ్రీనివాస్, జయేందర్ తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్‌ఎంల ముందస్తు అరెస్టు



రాజాపేట : అరెస్టయిన సెకండ్ ఏఎన్‌ఎమ్‌లు

భూదాన్‌పోచంపల్లి : సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఎన్‌ఎం యూనియన్ రాష్ట్రకమిటీ పిలుపుమేరకు అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న సెకండ్ ఏన్‌ఎంలను శుక్రవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో జానకి, నీలమ్మ, అనురాధ, రేణుక, గీత, సునీత, సంధ్యారాణి, మహాలక్ష్మి ఉన్నారు.

మోత్కూరు : తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సెకెండ్ ఏఎన్‌ఎంలు శుక్రవారం తలపెట్టిన అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న వారిని పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో మంజుల, పెసరు ఇందిర, జిట్ట సైదమ్మ, దామెర పార్వతమ్మ, భూక్య మంగమ్మ పాల్గొన్నారు.

రాజాపేట : వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న సెకెండ్ ఏఎస్‌ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తలపెట్టిన అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్తున్న స్థానిక సెకెండ్ ఏఎన్‌ఎంలను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో అనిత, సులోచన, మంగమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న అదనపు ఏఎన్‌ఎంల సర్వీస్‌ను రెగ్యులరైజ్ చేయాలంటూ డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న అదనపు ఏఎన్‌ఎంలను మండల కేంద్రంలో పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో ధనలక్ష్మి, సునీత, జయలక్ష్మి, ఏముల తదితరులు ఉన్నారు.

సీహెచ్‌సీని వంద పడకల ఆస్పత్రిగా మార్చాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఆలేరురూరల్ : ఆలేరు సీహెచ్‌సీని వంద పడకల ఆస్పత్రిగా మార్చాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ చెరిగె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని సీహెచ్‌సీ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చేయాల్సిన ఆలేరును ఎమ్మెల్యే ఎడారిగా మారుస్తున్నారన్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎక్స్‌రే యంత్రపరికరాలు ఉన్నప్పటికీ రేడియాలజిస్ట్ లేని కారణంగా ఎక్స్‌రే గదికి తాళం వేశారని ఆరోపించారు. ఆలేరులో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు జహంగీర్, ద రాఘవేంద్ర, మల్లయ్య, సుభాష్, సిద్దులు, మురళి, మురళి, ఆంజనేయులు, నరేందర్, రాజు, గంగేష్ పాల్గొన్నారు.

అటెండర్‌లే దిక్కు

- ఇబ్బందులు పడుతున్న సందర్శకులు

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు అందుబాటులో లేకపోవడంతో శుక్రవారం ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ జయమ్మ హైదరాబాద్ జిల్లాకు బదిలీ కావడంతో ఆమె స్థానంలో నియామకమైన కృష్ణయ్య గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం నియోజక వర్గ స్థాయి ఎన్నికల సమావేశం ఉండటంతో ఆలేరుకు వెళ్లిపోయారు. ఇక ఆర్‌ఐ చిప్పలపెల్లి యాదగిరి అనారోగ్యం కారణంగా సెలవు పెట్టడంతో ఇంత వరకు ఎవరికి ఇంచార్జీ ఇవ్వలేదు. సీనియర్ అసిస్టెంట్ పాండు డ్యూటీలో ఉన్నప్పటికీ ఫీల్డ్‌లో లేకపోవడంతో కార్యాలయంలో ఎవరు అందుబాటులో లేరు. డిప్యూటీ తహసిల్దార్ జయలక్ష్మి మెటర్నిటీ సెలవుల్లో ఉండటంతో రాజపేట డిప్యూటీ తహసిల్దార్ మాత్రమే ఇంచార్జీగా రెండు రోజుల నుంచి విధులు నిర్వహిస్తూ భూరిజిస్ట్రేషన్‌లు చేస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కృష్ణవేణి కలెక్టరేట్ కార్యాలయంలో తాత్కాలిక విధుల నిర్వహణ డ్యూటీ వేశారు. దీంతో తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్‌లు మాత్రమే కనిపిస్తున్నారు. కార్యాలయానికి పనుల నిమిత్తం వచ్చె సందర్శకులు నాలుగు రోజుల నుంచి ఇబ్బందులు పడుతున్నారు.

దుండగులను శిక్షించాలి

వలిగొండ : మండలంలోని చిత్తాపురం గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు కొల్లు నర్సిరెడ్డి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. శుక్రవారం నర్సిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బోడ సుదర్శన్, పోలేపాక యాదయ్య, ఎలగందు అంజయ్య, బాలగొని సత్యనారాయణ వీరస్వామి, ఎల్లంకి మహేష, బలికె మొగులయ్య, చెగూరి పాపయ్య, యాదగిరి, యాస జనార్దన్ రెడ్డి, నర్సయ్య, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

యాదగిరిగుట్ట: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శుక్రవారం ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా పని చేస్తున్న స్వీపర్లు, సిబ్బందిని పర్మినెంట్ చేయాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో ఇస్తారి, శేషగిరి, మల్లేష్, రామకృష్ణ, నరేష్, గణేష్, అండాలు, రాంచందర్, అయ్యం, అయిలమ్మ, కలమ్మ, రేణుక, స్వామి, బాలరాజు, రాజేష్, శ్రీధర్, రాజు, అఫీజ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

సాక్షి నెట్‌వర్క్ : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం కొనసాగింది. సమ్మెలో భాగంగా పంచాయతీ కార్మికులు ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట తమ నిరసన తెలిపారు.



మోత్కూరు : బోనాలు ఎత్తుకుని నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

యాదాద్రి కొండపై జారిపడిన కళాకారుడు

- కాలు విరగడంతో ఆస్పత్రికి తరలింపు

యాదగిరిగుట్ట : యాదాద్రి కొండపైన శుక్రవారం నిర్వహించిన అఖండనామ సంకీర్తన కార్యక్రమానికి వచ్చిన వనపర్తి జిల్లా కొత్తకోటకు చెందిన కొత్త బాలయ్య అనే కళాకారుడు ప్రమాదవశాత్తు జారిపడడంతో కాలు విరిగింది. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భజన కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తుండగా ఘటన చోటు చేసుకుంది. బాలయ్యను తోటి కళాకారులు ఆస్పత్రికి తరలించారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు

భువనగిరి : భువనగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగారం అంజయ్య ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కలాసికం సుజనను కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఆమె కలిసిన వారిలో ఆలేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, బాబురావు, జూకంటి రవీందర్, కేశవరెడ్డి, వీరస్వామి ఉన్నారు.

మొక్కలు బతికేలా చూడాలి

మోటకొండూర్: నర్సరీలో పెంచుతున్న మొక్కలు వంద శాతం బతికేలా చూడాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. శుక్రవారం మోటకొండూర్ మండల కేంద్రంలోని నర్సరీని సందర్శించారు. ఆయన వెంట ఎంపీడీఓ వీరస్వామి, కిషన్ ఉన్నారు.

నిబంధనలు లేకుండా రుణమాఫీ చేయాలి

భువనగిరిటౌన్ : నిబంధనలు లేకుండా రైతులు తీసుకున్న రుణాలు మొత్తం మాఫీ చేయాలని భువనగిరి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిక్కుల వెంకటేశం అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు ఎండీ అవైస్ చిస్తి, మజార్, అబీద్ అలీ, శ్రీనివాస్, చిరంజీవి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి సీఎం కేసీఆర్



భువనగిరి : సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



భూదాన్‌పోచంపల్లిలో..

భువనగిరి : రైతుల పక్షపాతి సీఎం కేసీఆర్ అని గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్, మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు అన్నారు. పంట రుణాలు మాఫీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తా వద్ద సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కిష్టయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, ఎంపీపీ నరాల నిర్మలవెంకటస్వామి యాదవ్, జెడ్పీటీసీ బీరు మల్లయ్య, బీఆర్‌ఎస్ పట్టణ, మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాష్, నాయకులు కస్తూరి పాండు, లక్ష్మీనారాయణ, రాఘవేందర్‌రెడ్డి, సత్యనారాయణ, స్వామి, ఇట్టబోయిన గోపాల్, సుధాకర్, పద్మ, ర్యాకల శ్రీనివాస్, సుభాష్, జంగయ్య, వెంకటేశ్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూనూరులో..

మండలంలోని కూనూరు గ్రామంలో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పాశం మహేష్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ అబ్బగాని వెంకట్, ఉప సర్పంచ్ గుండ్ల శ్రీనివాస్, నాగేంద్రబాబు, నాగరాజు, రమేష్, కిష్టయ్య, నారాయణ, శ్రీశైలం పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పంట రుణాలు మాఫీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ కేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మిశ్రీనివాస్, వైస్‌చైర్మన్ బాత్క లింగస్వామి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల, పట్టణ ప్రధానకార్యదర్శులు చిల్వేరు బాలనర్సింహ, గునిగంటి మల్లేశ్, సుధాకర్‌రెడ్డి, చంద్రయాదవ్, కె. మహేశ్, గోరంటి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ మన్నె పద్మారెడ్డి, బీఆర్‌ఎస్ సార బాలయ్యగౌడ్, సీత శ్రవన్, కిరణ్, యాదగిరి, శ్యామ్, యాదగిరి, నోముల ఉపేందర్‌రెడ్డి, వంగూరి పెంటయ్య, శ్రీను, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలిగొండ : మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మండలానికి చెందిన పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పైళ్ల రాజవర్ధన్ రెడ్డి, ఎంపీపీ నూతి రమేష్, తుమ్మల వెంకట్ రెడ్డి, పనుమటి మమత నరేందర్ రెడ్డి, బోళ్ల శ్రీనివాస్, గూడూరు శివశాంత్ రెడ్డి, తుమ్మల వెంకట్ రెడ్డి, కేసరి సత్తిరెడ్డి, కేసరి రాంరెడ్డి, కూనపురి కవిత, డేగల పాండరి, పల్లెర్ల సుధాకర్, సహదేవ్, రత్నయ్య, రవీంద్ర, ఎమ్మె లింగ స్వామి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



భువనగిరిటౌన్ : బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

భువనగిరిటౌన్ : రాహుల్ గాంధీని ఎంపీగా అనర్హుడిన ప్రకటించిన కేసు విషయంలో సూరత్ కోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇవ్వడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రమోద్‌కుమార్, జహంగీర్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు : రాహుల్ గాంధీని ఎంపీగా అనర్హుడిన ప్రకటించిన కేసు విషయంలో సూరత్ కోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇవ్వడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆ పార్టీ నాయకులు మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మలిపెద్ది మల్లారెడ్డి, కారుపోతుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ తండా సత్తయ్య, కరుణాకర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకన్న, నిమ్మల శ్రీనివాస్ యాదవ్, బద్దం నాగార్జున రెడ్డి, అవిశెట్టి కిరణ్, గడ్డం లక్ష్మయ్య, కిరణ్, సమీర్, యాదయ్య, నరసింహ, సతీష్, ఖాసిమ్, ఉప్పలయ్య, మహేందర్, మధు, రమేష్, జాంగీర్, అంజయ్య, నాగయ్య, రమేష్, సందీప్, సోమలింగాచారి పాల్గొన్నారు.

రామన్నపేట : పరువు నష్టం కేసులో సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎండీ జమీరొద్దిన్, అయ్యాడపు నర్సిరెడ్డి, జానీ పాల్గొన్నారు.

బండి సంజయ్‌ను కలిసిన గూడూరు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న గూడూరు నారాయణరెడ్డి

భువనగిరి : బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన బండి సంజయ్‌ను శుక్రవారం గూడూరు నారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన బండి సంజయ్‌ను శంషాబాద్ విమానాశ్రయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

బీటీరోడ్డు పనుల పరిశీలన

భువనగిరి : పట్టణంలోని కిసాన్‌నగర్ రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి అర్బన్‌కాలనీకి వెళ్లే మార్గంలో వేస్తున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీటీరోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్, రైతు సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ అమరేందర్, మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, రాజేందర్ రెడ్డి, కిష్టయ్య, కిరణ్‌కుమార్ ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

సైబర్ నేరాలపై అవగాహన

అడ్డగూడూరు : మండల పరిధిలోని చౌల్లరామారం ప్రధాన రోడ్డుపై శుక్రవారం ఎస్‌ఐ నాగరాజు ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ కేశవరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ చారి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని మహబూబ్‌పేట గ్రామంలో గీత కార్మిక సహకార సంఘం ఎన్నికలను శుక్రవారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా గాజుల రఘుపతిని, ఉపాధ్యక్షుడిగా నారాయణ, సెక్రటరీగా మచ్చ కిష్టయ్య, కోశాధికారిగా సిద్దిరాజులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రమేష్, శ్రీనివాస్, మల్లేష్, భాస్కర్, సిద్దయ్య, పరశురాములు, నర్సయ్య పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ అందజేత

రాజాపేట : మండల కేంద్రంలోని యువకులకు శుక్రవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు వట్టిపల్లి శ్రీనివాస్ గౌడ్ క్రికెట్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దాచపల్లి రాజు, పాల సంఘం చైర్మెన్ గాండ్ల నర్సింగరావు, బీజేపీ నాయకులు చల్మలపల్లి లక్ష్మణ్, చింతం వేణు, ఎర్రగోకుల వినోద్, జెడల శేఖర్, చిగుళ్ల బీరయ్య పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

అడ్డగూడూరు : మండల పరిధిలోని అజీంపేట గ్రామంలో జెడ్పీటీసీ నిధులు రూ.4లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం జెడ్పీటీసీ శ్రీరాముల జ్యోతి అయోధ్య, ఎంపీపీ దర్శన అంజయ్య శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రవళిక మల్లేష్, ఎంపీటీసీ బట్ట వెంకటయ్య, వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ బచ్చయ్య, ఎలేందర్, నారాయణ పాల్గొన్నారు.

ధ్వంసమైన కల్వర్టుల పరిశీలన

వలిగొండ : మండలంలో రెడ్ల రేపాక నుంచి కంచనపల్లికి వెళ్లే మార్గంలో, దాసిరెడ్డిగూడెం వద్ద వర్షాలకు ధ్వంసమైన కల్వర్టులను శుక్రవారం సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి సిర్పంగి స్వామి ఈర్లపల్లి ముత్యాలు, కొమ్ము స్వామి, శంకరాచారి, కందుల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

చేతి కర్రల పంపిణీ

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని సివియర్ డిసబిలిటీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు శుక్రవారం సీఐ దేవేందర్ చేతుల మీదుగా వాకర్స్, చేతి కర్రలను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తాడూరి శిరీషపరమేష్, కత్తుల బాలకృష్ణ, సిలివేరు శ్రీనివాస్, శేఖర్‌రెడ్డి, శివకుమార్, రఘు, శంకర్ పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

తుర్కపల్లి: మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం సర్పంచ్ జక్కుల శ్రీవాణివెంకటేశ్ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, స్వప్న, ఏఎన్ఎం అలివేలు, ఆశ వర్కర్లు మాధవి, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

తుర్కపల్లి : నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన గుగులోత్ దేశ్యానాయక్‌ను శుక్రవారం ఎంపీపీ భూక్య సుశీలరవీందర్‌నాయక్ కలిసి సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ రెడ్డి, ఎంపీటీసీ గిద్దె కరుణాకర్, ఏఎంసీ డైరెక్టర్లు మోతీరాంనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్లు నర్సింహులు నాయక్, శ్రీకాంత్, వెంకటేశ్‌యాదవ్, బాలకృష్ణయాదవ్, రమేష్‌గౌడ్, కరుణాకర్ పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ఆలేరురూరల్ : మున్సిపాలిటీలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరుతూ శుక్రవారం ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గంధమల్ల వెంకటయ్య, కొనపురం జయమ్మ, కందుల బాలమ్మ, రాజమ్మ, పోరెడ్డి ప్రసాద్, ఏలియా, ఎల్లమ్మ పాల్గొన్నారు.

మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

భువనగిరిటౌన్ : మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ స్వచ్ఛంద సంస్థల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భువనగిరి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతి శీలా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి రాచకొండ సీత మాట్లాడుతూ దేశంలో మహిళలకు రక్షణ కరవైందన్నారు. మణిపూర్ ప్రభుత్వం అల్లర్లపై నోరు విప్పి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ, ఇస్రత్, సోమన సభిత, ప్రసన్న సంతోషి, బట్టు రామచంద్రయ్య ఉన్నారు.

తహసీల్దార్ శ్రీనివాసరావుకు అస్వస్థత

బొమ్మలరామారం : మండల తహసీల్దార్‌గా భాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం కార్యాలయానికి వచ్చిన ఆయన పలువురు నాయకులతోపరిచయం చేసుకుని మాట్లాడుతుండగా ఒక్కసారిగా కళ్లు తిరిగి కింది పడిపోయారు. పీహెచ్‌సీలో విధుల్లో ఉన్న ఏయిమ్స్ వైద్యులతో పాటు 108 సిబ్బంది తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని చికిత్స అందించారు. గత రెండు రోజులుగా విశ్రాంతి లేకుండా ప్రయాణం చేయడంతో పాటు శుక్రవారం ఉదయం అల్పాహారం తీసుకోకుండా కార్యాలయానికి రావడంతోనే అస్వస్థతకు గురైనట్లు వైద్యులు తెలిపారు. మెరుగైన వైద్యంకోసం ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కొంత విశ్రాంతి అనంతరం తహసీల్దార్ శ్రీనివాస రావు ఆరోగ్యం నిలకడగా ఉండడంతో ఆస్పత్రి నుంచి డిచార్జ్ చేసినట్లు సమాచారం.